హైడ్రా అధికారులు కూల్చివేసిన పేదల గుడిసెలు

మా ఉసురు ఊరికే పోదు

- మా బతుకులు రోడ్డునపడ్డాయి
- రాత్రంతా కంటి మీద కునుకులేదు
- వండుకునే సామాన్లు కూడా లేవు
- పిల్లలున్నారనే కనికరం లేదు..
- కనీసం సమయం కూడా ఇవ్వలే..
- ఓటేసి గెలిపిస్తే గూడు లేకుండా చేశిండు
- రేవంత్ సర్కారుపై వలస కూలీల శాపనార్థాలు

మాదాపూర్, సెప్టెంబర్ 9: చిన్నారుల ఆకలికేకలు.. కూలిన బతుకులతో ఆగని ఆర్తనాదాలు.. రాత్రంతా కంటిమీద కునుకులేకుం డా.. రెప్పవాల్చని కూలీల బతుకులు చూస్తే ఎవరికైనా కన్నీళ్లు రాకమానవు. వండుకునేందుకు సామాన్లు లేవు.. ఉండేందుకు గూడు లేదు. ఒక్కరోజులోనే వారి బతుకులు రోడ్డునపడ్డాయి. సర్కారు నిర్వాకంతో పేదవాని గూడు చెదిరింది. మాదాపూర్‌లోని సున్నం చెరువులో గుడిసెలు వేసుకున్న వలస కూలీల బతుకులన్నీ కన్నీటి వ్యథలే. ఆదివారం రాత్రి కూల్చిన చోటే బట్టలు అడ్డం కట్టుకొని పిల్లలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. రెక్కాడితేగానీ డొక్కాడని మా బతుకులపై రేవంత్ సర్కారు కక్ష కట్టిందని మండిపడ్డారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఓట్లేసి గెలిపిస్తే బతుకులు మారుతాయని కలలు గన్నాం.. కానీ మా బతుకులు కూలుస్తడని కలలో కూడా ఊహించలేదని కన్నీరు కార్చారు. కేసీఆర్ పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తే.. రేవంత్ ఉన్న గూడుపై గునపాలు దించుతున్నాడని గుండెలు బాదుకున్నారు. చిన్న పిల్లలు ఉన్నారని దయా దాక్షిణ్యం లేకుండా హైడ్రా అధికారులు వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. కనీస సమయం ఇవ్వకుండా మా బతుకులను నేలమట్టం చేశారని సర్కారుపై దుమ్మెత్తిపోశారు.

ఒంటిపై కవర్లు కప్పుకొన్నాం

రేవంత్ సర్కార్ చేసిన పనికి పట్టరాని దుఃఖంతో రాత్రంతా కంటి మీద కునుకులేదు. పిల్లలపై కవర్లను కప్పి పడుకోబెట్టాం. వండుకుందామంటే సామాన్లు ధ్వంసమయ్యాయి. మా ఊరికెళ్దామంటే అక్కడ పని దొరకదు. ఇల్లు అద్దెకు అడిగితే రూ.10 వేల నుంచి రూ. 15వేలు చెబుతున్నరు. ఇంట్లో వారందరం కష్టపడితే వచ్చేది అంతంత మాత్రమే. అద్దె కడుతూ ఎలా బ్రతకాలి. రేవంత్ మాకు తీవ్ర అన్యాయం చేసిండు. ప్రభుత్వమే మాకు ఉంటడానికి ఏర్పాట్లు చేయాలె. **- స్వప్న, కల్వకుర్తి (కూలీ)**

ఓ వైపు వర్షం.. మరో వైపు భయం

సర్కార్ నిర్వాకంతో వండుకోవడానికి సామాన్లు లేవు. పిల్లలకు తిండి పెట్టలేని దుస్థితి. రాత్రంతా ఏడుస్తూనే ఆకలితో పడుకున్నారు. రాత్రి సరిగా నిద్ర లేక.. వర్షం పడితే ఎలా పడుకోవాలో అర్థంకాక భయంతో కంటిమీద కునుకు లేకుండా ఉన్నాం.

- లక్ష్మి, కర్నాటక (కూలీ)

ఏం చేయాలి.. ఎక్కడికి పోవాలి..?

ఉన్న గుడిసెను కూల్చారు. ఎక్కడికి పోవాలో తెలియదు. సర్కార్ మా బతుకులను ఆగం చేసింది. మా ఓట్లు కావాలి కానీ మేము ఎలా బతుకుతున్నామో అవసరం లేదా? రేవంత్ మా వద్దకు వచ్చి మా పరిస్థితిని కండ్లతో చూడు. పిల్లలు ఉన్నారన్న దయా దాక్షిణ్యం లేకుండా రేవంత్ సర్కార్ మాపై కక్ష కట్టింది.

- సుగుణమ్మ, మహబూబ్‌నగర్ (కూలీ)

ఓటేస్తే ఆగం చేశిండు

మాకు ఎంత కష్టమొచ్చినా ఇక్కడే ఉంటాం. మాకు వేరే దారి లేదు. ఇక్కడ పదేండ్ల నుంచి గుడిసెలు వేసుకొని బతుకుతున్నం. ఉన్నట్టుండి కూల్చివేతలు చేస్తే ఎలా? ప్రభుత్వానికి మా గోడు కనిపించదా? మా బ్రతుకులు అంటే అంత చులకనా? మా సొంతూరు అని ఓటును వేసి గెలిపించుకున్నం. మా బతుకులను ఆగం చేస్తాడనుకోలేదు. **- చంద్రమ్మ, కోస్గి కొడంగల్ (కూలీ)**

గణేశ్ మండపంలో తలదాచుకున్నం

ఈ ప్రభుత్వం తీరుతో మా బతుకులు రోడ్డునపడ్డాయి. మా పరిస్థితి పగ వారికి కూడా రాకూడదు. ఎంతటి కష్టం వచ్చినా ఎక్కడికైనా వెళ్లి బతకాలనుకున్న బతకలేం. ఇక్కడ గుడిసెలు వేసుకొని అద్దెలు లేకుండా ఉంటున్నాం. మా పిల్లలకు రాత్రంత నిద్ర లేదు. దిక్కుతోచక గణేశ్ మండపంలో తల దాచుకున్నం. **- శంకర్, వరంగల్ (కూలీ)**

బిల్డర్‌పై కేసు వేసుకోండి!

- లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ విల్లాల యజమానులకు హైడ్రా కమిషనర్ సూచన
- హైడ్రా కార్యాలయానికి వెళ్లి కలిసిన బాధితులు
- సమాచారం ఇవ్వకుండానే ఇండ్లు కూల్చారని ఆవేదన

హైడ్రా కూల్చివేసిన నిర్మాణాలు

దుండిగల్/జగద్గిరిగుట్ట,సెప్టెంబర్9: అమ్మినవారు అంతా సక్రమమే అని నమ్మించారు.. అప్రమత్తం చేయాల్సిన అధికారులు అవేవీ చూడకుండానే అనుమతులిచ్చారు. తీరా లక్షలు, కోట్లు పోసి విల్లాలు కొన్న యజమానులు ఇప్పుడు రోడ్డున పడి నెత్తీనోరు బాదుకుంటున్నారు. హైడ్రా వచ్చి తమ కండ్లెదుటే కలల సౌధాలను నేలమట్టం చేసింది. ఇదేమని అడిగితే.. 'బిల్డర్‌పై కేసు వేసుకోండి' అని ఉచిత సలహా ఇచ్చింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని కత్వా చెరువు సమీప లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ బాధితుల పరిస్థితి ఇది! మల్లంపేట పరిధిలోని సర్వేనంబరు 170/3, 170/4, 170/5 లో లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్మించిన పలు విల్లాలు కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్నాయంటూ హైడ్రా రెండు రోజుల కిందట కూల్చివేతలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం సాయంత్రం హైడ్రా కార్యాలయానికి వెళ్లి కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై వివరాలు వెల్లడించినట్టు తెలిసింది. బాధితులు కూడా తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను ఆయనకు చూపినట్టు సమాచారం. హైడ్రాపరంగా తామేమీ చేయలేమని చెప్పిన కమిషనర్.. బిల్డర్‌పై కేసు వేసుకోండి అని సలహా ఇచ్చినట్టు తెలిసింది.

అధికారులే అసలు దోషులు!

మల్లంపేట పరిధిలోని సర్వేనంబరు 170/3, 170/4, 170/5లో లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ 360 విల్లాలు నిర్మించింది. మాజీ సైనికోద్యోగుల నుంచి 15 ఎకరాలు కొనుగోలు చేసి మరో ఐదు ఎకరాలను ఆక్రమించి విల్లాలు కట్టినట్టు గతంలోనే ఆరోపణలొచ్చాయి. ఇందులో హెచ్ఎండీఏ అనుమతులతో 60 విల్లాలు నిర్మించగా ఆపై గ్రామ పంచాయతీ అనుమతుల పేరిట మరో 300 విల్లాలు నిర్మించారు. కత్వా చెరువును అనుకుని ఉన్న బఫర్/ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ప్రహరీ నిర్మించి మట్టి పోసి ఎత్తు పెంచారు. 2018 నుంచి ఏడాది కిందటి వరకు క్రయ, విక్రయాలు జరిగాయి. సుమారు 150 గజాల్లో జీ ప్లస్ వన్ తరహా ఇండ్లను రూ.50 లక్షల నుంచి కోటిన్నర వరకు అమ్మారు. పంచాయతీ నుంచి మున్సిపల్‌లోకి మారగా నివాసితులు కరెంట్ బిల్లులు, ఇంటిపన్నులు చెల్లిస్తూ వస్తున్నారు. ఇప్పుడు హైడ్రా కూల్చివేతలతో హతాశులయ్యారు. గతంలోనే తాము అనుమానంతో ఇక్కడి విల్లాలపై రెవెన్యూ అధికారులను సంప్రదించి భూమి విషయమై స్పష్టత కోరినా సమాచారం ఇవ్వలేదని, ఇప్పుడు అధికారులే దగ్గరుండి హైడ్రాతో కలిసి కూల్చివేయించారని వాపోతున్నారు. ఆదివారం రాత్రి 13 విల్లాలను కూల్చిన అధికారులు, మరో 14 విల్లాలను కూల్చేస్తామని మార్కింగ్ చేశారు. కూల్చివేతల సమయంలో సామాన్లు బయటపడేశారని, పిల్లలు అన్నం తింటున్నా బయటకు పంపారని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. విల్లాలు విక్రయించిన వారి నుంచి తమకు నష్ట పరిహారం ఇప్పించాలని, లేదా మరోచోట తమకు ఇండ్లు కట్టించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

పేదలపై దౌర్జన్యం.. పెద్దలపై మౌనం

- 'హైడ్రా'తో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- మహారాష్ట్ర ఎన్నికల ఖర్చు కోసమే డ్రామాలు
- 264 చెరువులకే ఎఫ్‌టీఎల్ ఖరారు : గాదరి కిశోర్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్ చేసి వసూలు చేసిన సొమ్మును మహారాష్ట్ర ఎన్నికల ఖర్చు కోసం పంపాలనే అజెండాను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అమలు చేసినట్టు తెలుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆరోపించారు. పేదలపై బుల్డోజర్ రాజకీయం చేస్తున్నారని, పెద్దల ఇండ్ల విషయానికి వచ్చే సరికి సైలెంట్ అయిందని ఎద్దేవాచేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకతను హైడ్రాతో రేవంత్‌రెడ్డి కప్పిపుచ్చుతున్నారని, ఆరు గ్యారెంటీల ముచ్చట లేకుండా చేస్తున్నారని విమర్శించారు. సినీనటుడు మురళీ మోహన్, రేవంత్‌రెడ్డి సోదరుడి నిర్మాణాలను నోటీసులు మాత్రమే ఇచ్చి, సమయం ఇవ్వకుండా పేదల ఇండ్లను మాత్రం కూల్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రానికల్లా నివాసం ఉండే వారి ఇండ్లను కూలగొట్టబోమని చెప్పి న్నారని, పెద్దల ఇండ్లను కూల్చబోమని ప్రభుత్వం ఇచ్చిన ప్రెస్‌నోట్‌లో ఉన్నదని పేర్కొన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన డైరెక్షన్ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని, హెచ్ఎండీఏ పరిధిలో 2,569 చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని హైకోర్టు ఆదేశిస్తే.. ఇప్పటి వరకు 264 చెరువులకే ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారని తెలిపారు. నిర్ధారణ కాకుండా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని ఎలా చెప్తారని ప్రశ్నించారు. హైడ్రా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని సీఎం, హైడ్రా కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో పేదల ఇండ్లు ఉంటే వాటిని తొలగించడంతో పాటు పునరావాసం కల్పించాలని హైకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. రాజకీయ కక్ష సాధింపులకు హైడ్రాను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఫైళ్లు ఎవరికి పంపాలో సీఎంకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు.

విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాలి : గెల్లు

వారం నుంచి బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ధర్నా చేశారని, వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడుగా రేవంత్‌రెడ్డి గోడ దూకి బాసర ఐఐటీకి వెళ్లారని, అధికారంలోకి వస్తే నాలుగు ట్రిపుల్ ఐటీలు పెడతామని చెప్పారని, ఇప్పుడు ఉన్న బాసర ట్రిపుల్ ఐటీ గురించే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి బాసర ఐఐఐటీని సందర్శించారని, విద్యార్థులకు మినీ స్టేడియం కోసం మూడు కోట్లు కేటాయించారని, కాంగ్రెస్ వచ్చాక దాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామి యాదవ్, పడాల సతీశ్, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, నూకల యుగేందర్‌రెడ్డి, జహీర్‌ఖాన్ పాల్గొన్నారు.

మహిళాశక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ : సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాతగా అభివర్ణించారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీఎం నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ కనబరిచిన ధైర్య సాహసాలను స్మరించుకున్నారు. ఐలమ్మ ప్రేరణతో అనేక మంది మహిళలు నాటి భూ పోరాటానికి ముందుకు వచ్చారని సీఎం గుర్తుచేశారు.

యూజీసీ గ్రాంట్స్‌పై జీఎస్టీని మినహాయించాలి

- జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహించేలా ఆయా సంస్థలకు వచ్చే గ్రాంట్లపై ఉన్న జీఎస్టీని మినహాయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్రానికి సూచించారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్‌లో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎం రిజ్వీతో కలిసి భట్టి హాజరయ్యారు. జీఎస్టీ 18 శాతం శ్లాబు నుంచి 5 శాతంలో మార్చాలని భట్టి విక్రమార్క కోరారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో వరద సహాయ నిధి సేకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలతో నష్టపోయిన బాధితుల సహాయార్థం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం బస్‌భవన్ వద్ద రూ.5,070 నిధిని వసూలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, సీఐటీయూ నాయకుడు సోమన్న, ఎస్‌డబ్ల్యూఎఫ్ జీహెచ్‌జెడ్ అధ్యక్షుడు, కార్యదర్శి ప్రకాశ్, జీఆర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ ఫైనల్ 'కీ'లోనూ తప్పులు!

- డీఎస్ఈ కార్యాలయానికి బాధితుల క్యూ
- రివైజ్డ్ 'కీ' విడుదల చేయాలని డిమాండ్
- సవరించి న్యాయం చేయాలని అభ్యర్థుల వేడుకోలు

డీఎస్సీ ఫైనల్ 'కీ'లోనూ తప్పులు దొర్లాయని, వాటిని సవరించాలని కోరుతూ తగు ఆధారాలతో సహా పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ముందు ప్రదర్శిస్తున్న అభ్యర్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షల్లో రోజుకో వివాదం వెలుగుచూస్తున్నది. ఇప్పటికే పలు ప్రశ్నలు పునరావృతం కాగా, ఇటీవలే ప్రకటించిన ప్రాథమిక 'కీ'లోనూ అనేక తప్పులు వెలుగుచూశాయి. ఇది చాలదంటూ తాజాగా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ ఫైనల్ 'కీ'లోనూ తప్పులున్నాయి. కొన్ని ప్రశ్నలకు తప్పుడు సమాధానాలు ఇచ్చారని, కొన్ని ప్రశ్నలకైతే ఇచ్చిన ఆప్షన్లలో అసలు సమాధానాలే లేవని అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం పలువురు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చారు. 100 మందికి పైగా అభ్యర్థులు విద్యాశాఖ అధికారులను కలిసి పలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా జూలై 22, 23న జరిగిన ఎస్జీటీ ఫైనల్ 'కీ' పై అభ్యంతరాలు వెలిబుచ్చారు. తప్పులు సవరించి, మార్కులు కలపాలని కోరారు.

ఫలితాలు ఆలస్యం..

అభ్యర్థుల అభ్యంతరాల నేపథ్యంలో డీఎస్సీ ఫలితాలు ఆలస్యమయ్యే అవకాశముంది. వంద మందికి పైగా అభ్యర్థులు ఫైనల్ కీపై అభ్యంతరాలు వ్యక్తంచేయగా, వాటిని పరిశీలించి మరోసారి సబ్జెక్టు నిపుణుల కమిటీకి ఆధారాలు పంపిస్తామని పాఠశాల విద్యాశాఖలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు. తప్పులు నిజంగానే దొర్లాయని నిపుణుల కమిటీ గుర్తిస్తే మళ్లీ రివైజ్డ్ 'కీ'ని విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డీఎస్సీలో వచ్చిన మార్కులు, టెట్ మార్కులను కలిపి జీఆర్ఎల్(జనరల్ ర్యాంకింగ్ లిస్ట్)ను విడుదల చేస్తారు. అనంతరం 1:3 జాబితాను విడుదల చేసి అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టి మెరిట్ ప్రకారం నియామక పత్రాలను అందజేస్తారు. అయితే తుది 'కీ' లోనూ తప్పులు దొర్లితే ఈ ప్రక్రియంతా జరగడానికి కాస్త సమయం పట్టే అవకాశముంది.

ఫైనల్ 'కీ'పై అభ్యర్థుల అభ్యంతరాలు ఇలా..

- ఒక వర్ణం స్థానంలో మరొక వర్ణం వచ్చి చేరడాన్ని ఇలా అంటారు?
  ఆప్షన్లు : 1)ఏకాదేశం 2)ఆదేశం 3)బహుళము 4)నిత్యము
  అయితే అధికారులు విడుదల చేసిన తుది కీ ప్రకారం సరైన సమాధానం ఆప్షన్ 2) ఆదేశం అని ఇచ్చారు. కానీ అభ్యర్థులు ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఆప్షన్ 1) ఏకాదేశం అంటున్నారు. ఇదే ప్రశ్న ఈ ఏడాది మేలో జరిగిన టెట్ పరీక్షలోనూ ఇచ్చారు. ఫైనల్ కీలో సమాధానం ఏకాదేశం ఇచ్చారని, కాని ప్పుడు డీఎస్సీలో 'ఆదేశం' ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. అప్పుడు సరైన సమాధానం.. ఇప్పుడు డీఎస్సీలో ఎందుకు తప్పవుతుందని ప్రశ్నిస్తున్నారు. పుస్తకాల్లోనూ కరెక్ట్ ఆన్సర్ 'ఏకాదేశం' ఉందని అంటున్నారు.
- భారత ఉపరాష్ట్రపతి వీరిచే ఎన్నుకోబడతారు?
  ఆప్షన్లు: 1) పార్లమెంటు ఉభయ సభలకు ఎన్నికైన మరియు నామినేట్ చేయబడిన సభ్యులు
  2)అన్ని రాష్ట్రాలకు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఎన్నికైన ఎమ్మెల్యేలు
  3)లోక్‌సభ మరియు రాజ్యసభకు ఎన్నికైన సభ్యులు మాత్రమే
  4)అన్ని రాష్ట్రాల ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు
  ఫైనల్ 'కీ' ప్రకారం సరైన సమాధానం ఆప్షన్ 1. కానీ అభ్యర్థులు చెబుతున్న దాని ప్రకారం సరైన జవాబు ఆప్షన్ 3 అంటున్నారు. పుస్తకాల్లోనూ ఇదే జవాబు ఉందని ఆధారాలు చూపిస్తున్నారు.
- 'డ్నీపర్, వోల్గా వంటి నదులు ఈ ప్రాంతంలో ఉద్భవించాయి' అనే ప్రశ్నలో 'నైపర్' అనే పదం అనువాదం తప్పుగా పడింది. దీనికి మార్కును కలపాలి.
- 'మనం మానసికంగా ఆరోగ్యవంతుడు అని చెప్పినప్పుడు.. అది ఈ క్రింది అంశాల పరంగా ఆరోగ్యకరమని అర్థం' ఈ ప్రశ్నకు ఏ, బీ, సీ, డీ నాలుగు ఆప్షన్లు సరైనవి.
- 'పట్టణాలు, గ్రామాల్లో మీరు అత్యంత ఇష్టపడేవి ఏవీ అను ప్రశ్న ఈ విద్యాప్రమాణాన్ని సాధించేందుకు ఉద్దేశించినది' దీనికి సమకాలీన సమస్యలపై ప్రతిస్పందన, ప్రశ్నించుట సరైన సమాధానం.
- ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్‌లో 'ఇన్‌విట్రో' అంటే అక్షరాలా అర్థం అన్న ప్రశ్నకు ప్రయోగశాలలో అన్నది కూడా సరైన సమాధానం.
- 'ప్రపంచంలోని అతిపెద్ద సోలార్ పవర్ పార్క్‌ను ఈ రాష్ట్రంలో ప్రారంభించారు' అన్న ప్రశ్న ఇచ్చారు. కానీ ఇంగ్లిష్‌లో శక్తి స్థల అన్న పేరు ఇచ్చి తెలుగులో ఈ పేరును ఇవ్వలేదు. కనుక దీనికి మార్కు కలపాలి.

వర్షాల ఎఫెక్ట్.. 2,300కి.మీ రోడ్లు ధ్వంసం

- పునరుద్ధరణకు రూ.2వేల కోట్లు
- అధికారుల అంచనా

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): భారీ వర్షాల ప్రభావంతో రాష్ట్రంలో సుమారు 2,300 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం కాగా, పునరుద్ధరణకు సుమారు రూ. 2వేల కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా రోడ్లు దెబ్బతినగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ముంపునకు గురైన 700 ప్రాంతాల్లో రోడ్లపై కంకర తేలగా, దాదాపు 100ప్రాంతాల్లో వరదలతో రోడ్లు కొట్టుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం రేపు రాష్ట్రానికి రానున్నది.

రాబోయే 3 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. సోమవారం సాయంత్రం పూరీ వద్ద తీరం దాటిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ దిశగా పయనించి క్రమంగా బలహీనపడుతుందని ఐఎండీ పేర్కొన్నది. రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఈ నెల 15 వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో ములుగు, జయశంకర్‌భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మోస్తరు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నెల 12 వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. అల్లూరి జిల్లా జీకే వీధి మండలం చట్రాయి పల్లి వద్ద కొండచరియలు విరిగిపడి ఒకరు మృతిచెందగా.. ముగ్గురు గల్లంతైనట్టు తెలుస్తోంది. శిథిలాల కింద చిక్కుకున్న నలుగురిని అధికారులు రక్షించారు. గడిచిన 24గంటల్లో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో గరిష్ఠ వర్షపాతం 6.41 సెంటీమీటర్లు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ప్రతి కుటుంబానికి 16,500 సాయం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.16,500 చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడారు. 33 జిల్లాల్లో వర్షం ప్రభావితం చూపిందని, 358 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 2 లక్షల మంది ప్రభావితం అయ్యారని తెలిపారు. 158 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 13,494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని మంత్రి వివరించారు.

నీట మునిగిన వట్టెం పంప్‌హౌజ్ (ఫైల్)

నీట మునిగినా.. నిమ్మకు నీరెత్తినట్టు

› మొదటిపేజీ తరువాయి...

అధికార వర్గాలు వెల్లడించాయి. ఇటీవల కురిసిన భారీగా వర్షాలతో నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శివారులోని నాగనూలు చెరువు ఉప్పొంగడంతోపాటు ఆ చెరువు బ్యాక్‌వాటర్ ఒక్కసారిగా పెరగడంతో సమీపంలోని వట్టెం రిజర్వాయర్‌కు నీటిని తరలించే కట్టకు గండి పడి టన్నెల్‌లోకి భారీగా నీరు చేరింది. అదేవిధంగా కుమ్మెర గ్రామ సమీపంలోని చెరువు వరద కూడా టన్నెల్‌లోకి చేరడంతో చూస్తుండగానే పంప్‌హౌస్ నీట మునిగిపోయింది. దానితోపాటు 16 కి.మీ. పొడవు, 9 మీటర్ల చుట్టుకొలతో ఉన్న 2 సొరంగాలు కూడా పూర్తిగా నీటితో నిండిపోయాయి. ఈ రెండింటిలో కలిపి మొత్తం 34 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం మరింత నీరు చేరకుండా రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు పంప్‌హౌస్, సొరంగాల్లో చేరిన నీటిని తోడివేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కానీ, ఆ పంప్‌హౌస్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకు నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది.

డీవాటరింగ్‌కు నెలన్నర రోజులు

పంప్‌హౌస్, సొరంగాల్లోని వరద నీటిని తొలగించేందుకు మొత్తం 16 పంపులను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. డీవాటరింగ్‌కు దాదాపు నెలన్నర రోజులు పడుతుందని, ఆ పనుల నిర్వహణకు రూ.2 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. కానీ, ఇప్పుడు అలా కాకుండా తొలుత పంప్‌హౌస్, డ్రాఫ్ట్ ట్యూబుల్లో చేరిన దాదాపు 5-6 లక్షల క్యూబిక్ మీటర్ల వరద నీటి అదనపు మోటర్ల ద్వారా తొలగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆ తర్వాత ప్రాజెక్టులోని పంపులను సిద్ధం చేసి వాటి ద్వారానే టన్నెల్‌లోని దాదాపు 26 లక్షల క్యూబిక్ మీటర్ల వరద నీటిని తొలగించవచ్చని అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. కానీ, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. పంప్‌హౌస్‌కు విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాస్తవానికి పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లోని మొత్తం 4 పంపింగ్ స్టేషన్లలో ఉద్దండాపూర్ మినహా మిగిలిన 3 ఇప్పటికే సిద్ధమయ్యాయి. నార్లాపూర్ పంపింగ్ స్టేషన్‌లో 145 మెగావాట్ల సామర్థ్యంతో 8, ఏదుల పంపింగ్ స్టేషన్‌లో 9, వట్టెం పంపింగ్ స్టేషన్‌లో 9 పంపులను ఏర్పాటు చేశారు. నార్లాపూర్ పంపింగ్ స్టేషన్‌లో ఇప్పటికే 2 పంపులకు విజయవంతంగా డ్రైరన్, వెట్‌రన్ నిర్వహించిన అధికారులు.. మిగిలిన ఏదుల, వట్టెం పంప్‌హౌస్‌లలోని పంపులను డ్రైరన్, వెట్‌రన్‌కు సిద్ధం చేశారు. కానీ, ఆయా పంపింగ్ స్టేషన్లకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆ ప్రక్రియను గత కొన్నినెలలుగా వాయిదా పడుతూ వస్తున్నది. వాటికి సర్వీస్ కనెక్షన్లు ఇవ్వాలంటే ఒక్కో పంపింగ్ స్టేషన్‌కు దాదాపు రూ.62 కోట్ల చొప్పున మొత్తంగా రూ.124 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఆ నిధుల కోసం ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదని, విద్యుత్తు కనెక్షన్లు లేకపోవడమే డీవాటరింగ్‌కు ఆటంకంగా మారిందని వివరించారు. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే వెంటనే విద్యుత్తు కనెక్షన్‌ను తీసుకుని డీవాటరింగ్ చేస్తామని, తద్వారా సాధ్యమైనంత త్వరగా పంప్‌హౌస్‌ను పునరుద్ధరించేందుకు అవకాశముంటుందని తెలిపారు. డీవాటరింగ్ తర్వాత మోటర్లను పరీక్షించాలన్నా తప్పకుండా విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాల్సిందేనని, నీట మునిగిన పంపులను మళ్లీ సిద్ధం చేసేందుకు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌కోకు నిధులు చెల్లించి పంపింగ్ స్టేషన్లకు సర్వీస్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతున్నారు.